## క్లుప్తంగా

### వరద బాధితులకు విరాళం



ఏయూ డీన్‌కు వరద బాధితుల సహాయం నిమిత్తం చెక్కును అందజేస్తున్న కళాశాల సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం కురుపాం మండల కేంద్రంలోని ఎస్.వి.కిషోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.గురువులు, వైస్ ప్రిన్సిపాల్ జి.మహేంద్ర విద్యార్థులతో కలసి రూ.51,116లు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో శనివారం విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో డీన్ టీవీ కృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా డీన్ తమ కళాశాల విద్యార్థులతో పాటు తమను కూడా అభినందించినట్లు ప్రిన్సిపాల్ గురువులు పేర్కొన్నారు.

### ప్రశాంతంగా ఆర్‌ఐటీఐ కౌన్సెలింగ్



ఆర్ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ నందు మిగులు సీట్లు భర్తీ కోసం శనివారం నిర్వహించిన నాల్గో విడత కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కౌన్సెలింగ్‌కు మొత్తం 120 మంది విద్యార్థులు హాజరు కాగా 91 మందిని ఆయా ట్రేడుల కోసం ఎంపిక చేసినట్లు చెప్పారు.

### పందాలు నిర్వహిస్తే చర్యలు

పాలకొండ రూరల్: పండగ నేపథ్యంలో ఎక్కడైనా గొర్రెప్పందాలు, కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దసరా నేపథ్యంలో మండలంలోని 32 పంచాయతీల్లో సచివాలయ మహిళా పోలీసుల ద్వారా అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెట్టామన్నారు. అలాగే సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ప్రశాంత వాతావరణంలో ఆధ్యాత్మిక చింతనతో దసరా వేడుకలు జరుపుకోవాలన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు వీరఘట్టం విద్యార్థి



సాత్విక్

వీరఘట్టం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఎస్.సాత్విక్ ఎంపికైనట్లు పీడీ శిర్లాపు ఉమామహేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో శనివారం జరిగిన అండర్ – 14 బాలుర వాలీబాల్ పోటీల్లో సాత్విక్ సత్తాచాటి సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు. దీంతో విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సాంబర, ఉపాధ్యాయులు గర్భాన శ్రీనివాసరావు, కల్లూరి శివకుమార్, తదితరులు అభినందించారు.

### భగత్‌సింగ్ స్ఫూర్తి ప్రదాత



భగత్‌సింగ్ జీవిత చరిత్రను వివరిస్తున్న విద్యార్థి

పాలకొండ రూరల్: స్వతంత్ర సంగ్రామంలో బ్రిటీస్ సైన్యంపై పోరాటం చేసిన ధీశాలి భగత్ సింగ్ యువతకు స్ఫూర్తి ప్రదాతని వెంకంపేట ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం పి.పరాంకుశంనాయు డు అన్నారు. పాఠశాల ఆవరణలో భగత్‌సింగ్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వతంత్ర్య కాంక్షను ప్రజల్లో రగల్చి చిన్న వయసులోనే ఉరి కంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్ భరతమాత ముద్దు బిడ్డ అని కొనియాడారు. అంతకు ముందు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భామిని: మండల కేంద్రంలో కొత్తూరు భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి ట్రస్ట్ కో ఆర్డినేటర్ సాంత్యాన హరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన శిబిరంలో వైద్యులు కె. రాజేష్, ఎ. అప్పలనాయుడు, శ్రావణి, తరుణ్, రవికుమార్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చోడవరపు సింహాచలం, పోలినాయుడు, సంతోష్‌కుమార్ సాంత్రో, పాగిరి రవి, తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: కోటిపాంలో సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భామిని: లివిరిలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాలకొండ: అన్నవరం సెంటర్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ముందు నినాదాలు చేస్తున్న పార్టీ నాయకులు కళావతి, విక్రాంత్, తదితరులు



వీరఘట్టం: వండవలో కాశీ విశ్వేశ్వరస్వామికి హారతి ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

# చంద్రబాబుకు బుద్ధి ప్రసాదించు స్వామీ..

కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పలు ఆలయాల్లో పాప ప్రక్షాళన పూజలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు మహా పవిత్రంగా స్వీకరించే లడ్డూలో పంది, ఆవు కొవ్వు, చేప నూనె కలిపారంటూ తప్పుడు ప్రచారం చేస్తూ, ఆ అపవాదును వైఎస్సార్‌సీపీపై నెట్టేందుకు చేస్తున్న కుయుక్తులను వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా హామీలు నెరవేర్చని కూటమి నాయకులు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు గమనిస్తున్నారని మాజీ ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సీతంపేట: వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గరుగుబిల్లి: తోటపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ ఉరిటి రామారావు తదితరులు



గుమ్మలక్ష్మీ పురం: కురుపాంలోని కస్పాగదబవలసలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

# త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

సీతంపేట: ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి గియాజుద్దీన్ అన్నారు. మండలంలోని గొయిది, శిలిగాం, దరబ పంచాయతీల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం లబ్ధిదారులతో 'మన ఇళ్లు – మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొత్తం 1109 లబ్ధిదారులకు గృహాలు మంజూరు కాగా వీటిలో 149 పూర్తయ్యాయన్నారు. మిగిలినవి కూడా త్వరితగతిని పూర్తి చేయించాలని సూచించారు. ఎంఎన్ఆర్ఈజీఎస్ లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాలు కల్పించనున్నట్లు చెప్పారు. డీఆర్‌డీఏ ద్వారా మహిళా సంఘ సభ్యులకు ఇళ్ల నిర్మాణాలకు రుణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజిలి, హౌసింగ్ ఏఈ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: అవగాహన కల్పిస్తున్న అధికారులు

**నిర్మాణాలు పూర్తి చేయండి..**

వీరఘట్టం: గతంలో వివిధ పథకాల ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ వినోద్ సూచించారు. మండలంలోని విక్రమపురంలో 'మన ఇల్లు – మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంతవరకు మండల వ్యాప్తంగా 2,464 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో కొన్ని పూర్తవ్వగా.. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఎంపీడీఓ వై.వెంకటరమణ, టీడీపీ నాయకులు పాదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్, మాచర్ల అనిల్, తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: సన్యాసిరాజుపేటలో గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

**గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి**

గరుగుబిల్లి: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు అన్నారు. మండలంలోని పెదగుడబ పంచాయతీ సన్యాసిరాజుపేట గ్రామంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇల్లు – మన గౌరవం కార్యక్రమంపై గృహ నిర్మాణాల లబ్ధిదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పథకంలో మంజూరైన ఇంటి నిర్మాణాలను వచ్చే ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేసేలా అవగాహన కల్పిస్తామన్నారు. గృహ నిర్మాణానికి రూ..80లక్షలతో పాటు స్వయం సహాయక సంఘాల ద్వారా మరో రూ.30వేలు రుణాన్ని మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మండలానికి సంబంధించి సొంత స్థలంలో 254 మందికి, లేఅవుట్‌లలో 242 మందికి వెరసి 496 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో 168 నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వి.అఖిల్, ఏఓ ఎస్.అర్జునరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఇళ్లు నిర్మించుకోవాలి**

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన మన ఇళ్లు–మన గౌరవం కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎస్.అప్పారావు కోరారు. కురుపాం సచివాలయంలో ఇళ్ల లబ్ధిదారులతో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోవాలని కోరారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ అచ్చయమ్మ తదితరులు పాల్గొన్నారు.

**బత్తిలి లే అవుట్ వద్ద..**

భామిని: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈఈ చంద్రశేఖరనాయుడు అన్నారు. బత్తిలి లే అవుట్ వద్ద 'మన ఇల్లు – మన గౌరవం' కార్యక్రమం నిర్వహించి, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, టీడీపీ కార్యకర్తలు గొడబ చినబాబు, సిర్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టం: విక్రమపురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ వినోద్



గుమ్మలక్ష్మీ పురం(కురుపాం): సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎస్.అప్పారావు



భామిని: మాట్లాడుతున్న ఏఈ చంద్రశేఖరనాయుడు

# పకడ్బందీగా దసరా ఉత్సవాలు

● పాలకొండ డీఎస్పీ రాంబాబు



కురుపాం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రాంబాబు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం మూలిగూడ జంక్షన్ సమీపంలో వెలసిన మాలతమ్మ గుడి వద్ద వచ్చే నెలలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. శనివారం ఆయన గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌ను, కురుపాం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఆయన కురుపాం మోడల్ స్కూల్‌ను సందర్శించి అక్కడి విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గూర్చి, సైబర్ నేరాల గూర్చి, మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాల గూర్చి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాలతమ్మ గుడిని సందర్శించి, దసరా ఉత్సవాలు సక్రమంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సీఐ బి.హరి, ఎస్ఐ బి.శివప్రసాద్‌లకు పలు సూచనలు చేశారు.

### ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



కురుపాంలోని కేటీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): విద్యార్థులు ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని వైడీఓ నెట్‌వర్క్ అవుట్ రీచ్ అధ్యక్షురాలు ఎ.గీతారాణి అన్నారు. కురుపాం మండల కేంద్రంలోని కేటీఆర్ జూనియర్ కళాశాలలో జూనియర్ కరస్పాండెంట్ కె.తిరుపతిరావు ఆధ్వర్యంలో మీకు తెలుసా.. కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతారాణి మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్, సుఖ వ్యాధులు, ప్రమాదవశాత్తు సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడే మందులపై అవగాహన కల్పించారు.

# సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ సిమ్మాలమ్మ

వీరఘట్టం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సీడీపీఓ సిమ్మాలమ్మ సూచించారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అచ్చెపువలస అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి నెలా క్రమం తప్పకుండా గర్భిణులకు సుగర్, బీపీ, తదితర పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రక్తహీనత ఉన్నవాళ్లకు ప్రత్యేకంగా పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ జి.స్వాతి, సూపర్‌వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలి

● ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు కొండలరావు



సమావేశంలో మాట్లాడుతున్న కొండలరావు

పాలకొండ: కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు పల్లా కొండలరావు కోరారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజల కోరిక మేరకు క్యూలైన్ల ఏర్పాటు, అమ్మవారి దర్శనం, ఘటాల తరలింపు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ ఐదు వేల మందికి అన్నదానం చేపడుతున్నామని తెలిపారు. ముహూర్తపు రాట రోజున లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు.

# వర్మీ కంపోస్టు తయారుచేయాలి



గొట్టివలసలోని ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ

గరుగుబిల్లి: సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) యూనిట్లు ద్వారా వర్మీ కంపోస్టు ఎరువును తయారుచేయాలని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని గొట్టివలస గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నాటికి ఎస్‌డబ్ల్యూపీసీ యూనిట్లు నుండి వర్మీ కంపోస్టును తయారుచేసేలా చర్యలు చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లు అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. వర్మీ కంపోస్టు ఎరువుతో నాణ్యమైన ఆహర ఉత్పత్తులను ఉత్పత్తి చేసేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### శిథిల భవనాలను గుర్తించండి



బిటివాడలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

వీరఘట్టం: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల సముదాయాల్లో ఉన్న శిథిల భవనాలను గుర్తించాలని జిల్లా విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు ఆదేశాలతో మండల వ్యాప్తంగా ఉన్న శిథిల పాఠశాల భవనాలను ఉపాధ్యాయలు శనివారం గుర్తించారు. మండల వ్యాప్తంగా 21 భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఎంఈఓలు తెలిపారు.

# నగర పంచాయతీ కార్యాలయం ముట్టడి



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ : నగర పంచాయతీ కార్యాలయం ముందు వేస్తున్న చెత్తను తొలగించాలని కోరుతూ పట్టణ పౌర సంక్షేమ సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు, దావాల రమణరావు మాట్లాడుతూ, చెత్త తొలగించాలని పలుమార్లు అధికారులను కోరినా ఎవ్వరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో కమిషనర్‌తో వాగ్వాదం చోటు చేసుకోవడంతో కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. పోలీసులు ఎంత చెప్పినా ఆందోళన విరమించకపోవడంతో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నగర పంచాయతీ మాజీ చైర్మన్ పల్లా కొండలరావు కలుగజేసుకుని రాజకీయాలకతీతంగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ప్రజా సంఘాల నాయకులు ఆందోళన విరమించారు.

# పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్య రక్షణ పొందవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 నేతృత్వంలో పట్టణంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. న్యాయస్థానం, డీఎస్పీ కార్యాలయం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ కొనసాగింది. కాంప్లెక్స్ సమీపంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు ఎం.శాంతి, ఎ.శ్రీనివాసరావు, రాఘవేంద్రనాయుడు, గురవయ్య, సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

గరుగుబిల్లి: అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సచివాలయ వైద్య సిబ్బంది బి.శ్రీదేవి అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 2లో పోషకాహార ప్రదర్శన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవగాహన తప్పనిసరి

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో వరి పంటకు ఆశించే ఎండుతెగులుపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ ఏఓ ఎ. వాహిని అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, తెగులు ఆశించిన పొలంలో నత్రజని ఎరువుల వాడకాన్ని నిలిపివేయాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచన మేరకు అంకురం దశలో పొటాష్ ఎరువులను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరాకు 20 కిలోల వరకు వేయాలన్నారు.

### విద్యుత్ శాఖ ఏఈగా శ్రీనివాసనాయుడు



బడే శ్రీనివాసనాయుడు

గరుగుబిల్లి: విద్యుత్ శాఖ మండల ఏఈగా బడే శ్రీనివాసనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జియ్యమ్మవలస మండల ఏఈగా పని చేస్తూ సాధారణ బదీలలో భాగంగా గరుగుబిల్లి మండలానికి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వినియోగదారులకు అసౌకర్యం లేకుండా చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.